# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 128 **VEKUVA SAMAYAM TELUGU DAILY**

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: శుక్రవారం 29 మే 2026








**సమయం ప్రతినిధి:** కర్ణాటక రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి ఆయన లోక్‌భవన్‌కు వెళ్లి.. తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. అయితే ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో.. ఆయన కార్యదర్శికి లేఖ అందజేశారు సిద్ధరామయ్య. గవర్నర్ బెంగళూరుకు తిరిగి వచ్చిన తర్వాత రాజీనామాపై అధికారిక నిర్ణయం తీసుకోనున్నట్లు లోక్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. రాజీనామా అనంతరం మీడియాతో మాట్లాడిన సిద్ధరామయ్య.. పార్టీ అధిష్ఠానం సూచనల మేరకే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, పార్టీ ఐక్యత దృష్ట్యా పదవి నుంచి తప్పుకుంటున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు అసెంబ్లీలో స్పష్టమైన మెజార్టీ ఉందని.. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పారు. ముఖ్యమంత్రిగా తనకు సహకరించిన ప్రజలు, పార్టీ నాయకులు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.




**సమయం ప్రతినిధి:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగు రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను ప్రకటించింది. ఈ మేరకు నేడు (గురువారం) పంజాబ్, హరియాణా, ఢిల్లీ, త్రిపుర రాష్ట్ర విభాగాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తూ వివరాలు వెల్లడించింది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి హర్ష్ మల్హోత్రాను నియమించింది. పంజాబ్ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు కేవల్ సింగ్ ధిల్లాన్ పేరును ప్రకటించింది. హరియాణా అధ్యక్షురాలిగా అర్చనా గుప్తాను, త్రిపుర బీజేపీ అధ్యక్షుడిగా అభిషేక్ దేబ్‌రాయ్‌ను నియమించింది. తొలిసారి ఎంపీ అయిన హర్ష్ మల్హోత్రాకి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కేంద్ర మంత్రి పదవి ఇచ్చింది. ప్రస్తుతం ఆయన కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా, రహదారుల శాఖ సహాయ మంత్రిగా పని చేస్తున్నారు. తూర్పు ఢిల్లీ నియోజకవర్గానికి హర్ష్ మల్హోత్రా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దేశ రాజధానిలో బీజేపీని క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం చేసేందుకు మల్హోత్రాను అధ్యక్షుడిగా ప్రకటించారు.




**సమయం ప్రతినిధి:** కేరళం మాజీ సీఎం పినరయి విజయన్ నివాసంలో ఈడీ రెయిడ్స్ సందర్భంగా అధికారులపై దాడికి యత్నించిన 8 మందిని అరెస్టు చేశామని రాష్ట్ర పోలీస్ చీఫ్ ఎ. చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇతర నిందితులను ఇప్పటికే గుర్తించామని కూడా తెలిపారు. హోం మంత్రి రమేశ్ చెన్నితాలతో సమావేశం అనంతరం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని హోం మంత్రి ఆదేశించారని అన్నారు. బుధవారం ఈడీ రెయిడ్స్ గురించి తెలియగానే భారీ స్థాయిలో పోలీసులను పంపించామని కూడా పోలీస్ చీఫ్ తెలిపారు. 'తాము వస్తున్నట్టు ఈడీ అధికారులు ముందుగా మాకు చెప్పలేదు. కానీ ఆపరేషన్ మొదలవగానే మేము భద్రత కోసం సెక్యూరిటీని పంపించాము' అని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకూ కేరళ పోలీసులు దాదాపు 300 మందిపై కేసులు పెట్టారు. అనుమతిలేకుండా గుమిగూడటం, ప్రభుత్వ అధికారులపై దాడి, అక్రమ నిర్బంధం, హత్యాయత్నం తదితర అభియోగాలతో కేసులు నమోదు చేశారు.




**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** నటసార్వభౌముడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావు(ఎన్టీఆర్) భారీ కాంస్య విగ్రహం హైదరాబాద్ అమీర్‌పేటలోని మైత్రీవనం చౌరస్తాలో కొలువుదీరింది. నూతనంగా ఏర్పాటుచేసిన 23 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు(గురువారం) ఘనంగా ఆవిష్కరించారు. గతంలో జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా.. మైత్రీవనం కూడలిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. నగరంలోని ఎన్టీఆర్ అభిమానుల చిరకాల వాంఛను నెరవేరుస్తూ, ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి ఈ విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేయించి మరీ ఆవిష్కరించారు. ఈ విగ్రహ ఏర్పాటు ప్రక్రియ విజయవంతం కావడంలో స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ విగ్రహ స్థాపన పనులను ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. నగర నడిబొడ్డున ఎన్టీఆర్ భారీ విగ్రహాన్ని ఆవిష్కరించడం పట్ల నందమూరి అభిమానులు, తెలుగు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, భారీ సంఖ్యలో ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.




**హైదరాబాద్, సమయం ప్రతినిధి :** తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఓ చల్లని కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ రెండు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయి. ఈ రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడటమే కాకుండా, రాగల మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా విస్తరించడానికి ముందు రాబోయే రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది. అందువల్ల రుతుపవనాలు పూర్తిగా ప్రవేశించే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండ తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం వేళల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.






## తెలంగాణ ప్రజల చైతన్యంలో సురవరం కృషి గొప్పది:మాజీ మంత్రి



**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి :** తెలంగాణ ప్రజలను చైతన్యవంతులను చేయడంలో సురవరం ప్రతాపరెడ్డి చేసిన కృషి గొప్పదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. సురవరం ప్రతాప్ రెడ్డి జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు.సురవరం ఒక వర్గానికి, ప్రాంతానికి పరిమితమైన వారు కాదని అన్నారు. ఆయన జీవిత చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో కవులే లేరని చెప్పిన రోజున 350 మందికి పైగా కవులతో గోల్కొండ కవుల సంచికను ప్రచురించి విమర్శకులకు గట్టి సమాధానం ఇచ్చారని అన్నారు.తెలంగాణ సాహిత్యానికి జాతీయ స్థాయిలో సురవరం గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు.

# సంపాదకీయం

## సంక్షోభం కాదు, ఇది 'సువర్ణా'వకాశం!

ఇరాన్ యుద్ధం మహా అయితే కొన్ని వారాలపాటు జరుగుతుందని అనుకున్నాం. కానీ శాశ్వత పరిష్కారం కనుచూపులో కన్పించటం లేదు. ఈ విపత్కర పరిస్థితుల్లో మధ్యకాలిక, దీర్ఘకాల నియంత్రణ చర్యలపై దృష్టి సారించాలి. ఈ సంక్షోభం, రవాణాకు అంతరాయం ఇంకొన్ని వారాలు, నెలలు కొనసాగవచ్చు. భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు మరిన్ని తలెత్తే అవకాశముంది. వాటికీ సిద్ధం కావాలి. మన తక్షణ సమస్య-- 2027 ఆర్థిక సంవత్సరానికి భారీ విదేశీ వాణిజ్య లోటును ఎదుర్కోవటం. ఇప్పటికే విదేశీ ద్రవ్య నిల్వలు హరించుకుపోతున్నాయి. చమురు, గ్యాస్ దిగుమతుల ఖర్చే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 230 బిలియన్ డాలర్ల దాకా అయ్యే అవకాశముంది. దీంతోపాటు, బంగారం పట్ల మోజు.. ఫారెక్స్ నిల్వల్ని ఖాళీ చేస్తోంది. గత మూడేళ్లలో 2,273 మెట్రిక్ టన్నుల పసిడిని దిగుమతి చేసుకున్నాం. ఇది ప్రపంచం మొత్తం బంగారం ఉత్పత్తిలో 25శాతం. ప్రస్తుత పసిడి ధరల ప్రకారం, గత మూడేళ్ల దిగుమతుల విలువ 336 బిలియన్?డాలర్లు.'సంక్షోభం-వృధా చేసుకోకూడని గొప్ప అవకాశం' అంటారు ఆర్థిక శాస్త్ర నోబెల్ గ్రహీత పాల్ రోమర్. ప్రస్తుత సంక్షోభాన్ని మనం అవకాశంగా మలచుకోవాలి. ఈ నేపథ్యంలో.. బంగారం విషయంలో అందరికీ లాభదాయకమైన పరిష్కారాన్ని ప్రతిపాదిస్తున్నాను. భారత్‌లో బంగారం ఉత్పత్తి నామమాత్రంగానీ.. దిగుమతులు, నిల్వలు మాత్రం ప్రపంచంలోనే అత్యధికం. ఇందులో చాలావరకు ప్రయివేటు వ్యక్తుల వద్ద ఉన్నాయి. రోమన్ సామ్రాజ్యం కాలం నుంచి ఈ సంస్కృతి మన సమాజంలో భాగమైంది. మన దేశం విలాస సరుకుల్ని రోమ్‌కి భారీగా ఎగుమతి చేసేది. సుగంధ ద్రవ్యాలు, ముత్యాలు, ఏనుగు దంతాలు, నాజూకు వస్త్రాలు వంటివి. రుతుపవన ఆధారిత వాణిజ్య మార్గాలను ఇందుకు వినియోగించుకునేది. ఈ ఎగుమతుల నుంచి మనకు భారీ వాణిజ్య మిగులు లభించేది. ప్రతిగా బంగారం, వెండి, వజ్రవైఢూర్యాలు వంటివి పెద్దమొత్తంలో భారత్ దిగుమతి చేసుకునేది. ఈ వాణిజ్యంపై రోమ్‌లో ఆనాటి సుప్రసిద్ధ రచయిత, సేనానాయకుడు ప్లైనీ ది ఎల్డర్ (క్రీ.పూ 23-79) పెద్ద ఫిర్యాదే చేశారు. రోమన్లకు విలాస వస్తువుల పట్ల మోజును ఆసరాగా చేసుకుని రోమ్ సామ్రాజ్యం నుంచి ఇండియా ప్రతి సంవత్సరం 100 మిలియన్ రోమన్ సిక్కాల (సెస్టర్లు అనే నాణేలు)ను కొల్లగొడుతోందని ఆక్షేపించారు. అలా దిగుమతులు మొదలైన కాలం నుంచి.. బంగారాన్ని దాచుకోవటం భారతీయ కుటుంబాలు, మత సంస్థలకు ఆనవాయితీగా మారింది. భారతీయుల వద్ద ఇప్పటికి 35-40వేల మెట్రిక్ టన్నుల పసిడి ఉందని అంచనా. మానవ జాతి చరిత్రలో వెలికితీసిన మొత్తం బంగారంలో ఇది సుమారు 20శాతం. భారత్‌లో ఉన్న ఈ మొత్తం బంగారం విలువ ప్రస్తుత ధరల ప్రకారం 5 ట్రిలియన్?డాలర్లు. మన సాంస్కృతిక పరంపరలో బంగారు నగలు భాగమైనా, ఆ పసిడి మన దేశంలో నగల తయారీకి ఉపయోగపడటం లేదు. దీంతో విదేశాల నుంచి ఏటా భారీ మొత్తాల్లో దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. పోనీ, డబ్బు రూపంలోకి మార్చి సమాజానికో, కుటుంబానికో అభివృద్ధి అవసరాలకు ఉపయోగపడే పెట్టుబడిగా మార్చుకోగలుగుతున్నామా అంటే-- అదీ లేదు. 98శాతం బంగారం ప్రజల వద్ద ఇళ్లలోనో, లాకర్లలోనో నిరుపయోగంగా ఉంది. రిజర్వు బ్యాంక్ వద్ద 880 మెట్రిక్ టన్నుల వరకు నిల్వలు ఉంటాయేమో. 2015లో ప్రవేశపెట్టిన గోల్డ్ మానిటైజేషన్ పథకం (జీఎంఎస్) కేవలం 37.81 మెట్రిక్ టన్నుల పసిడిని ఉత్పాదక అవసరాలకు మళ్లించింది. అదే ఏడాది తీసుకొచ్చిన సావరిన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ) రూ.72,000 కోట్లను మాత్రమే బాండ్లుగా మార్చగలిగింది. సభ్యుల పెట్టుబడి బాండ్ల ద్వారా పోగైన మొత్తం బంగారం సుమారు 147 మెట్రిక్ టన్నులు. ఇప్పుడు బంగారం ధర చుక్కలు తాకటంతో.. ప్రభుత్వ ఖజానాపై ఆ మేరకు భారం పడుతుంది. ఎస్‌జీబీ హామీల్ని నెరవేర్చటానికి అంచనాలకు మించి ఎక్కువ మొత్తాల్ని నష్టపోవాల్సి ఉంటుంది. ఇంత సంక్షోభంలోనూ ఖరీదైన దిగుమతుల అవసరం లేకుండా, దేశీయ అవసరాలకు మన వద్దే నిరుపయోగంగా నిల్వవుంచిన బంగారాన్ని వినియోగించలేమా? దేశంలో మౌలిక వసతులను, మన ఉత్పాదక శక్తిని పెంచే ప్రయివేటు ప్రాజెక్టులకు అవసరమైన నిధులను సమకూర్చుకోవటం కోసం భారీ బంగారం నిల్వల రూపంలో నిరుపయోగంగా ఉన్న ఈ పెట్టుబడిని ఉపయోగించలేమా? ఎస్‌జీబీలో రిస్క్ ఉన్నమాట వాస్తవం. బాండ్?కొనుగోలుదారులు నగదు చెల్లించి, వర్చువల్ (ఆన్‌లైన్) బంగారాన్ని కొనుగోలు చేస్తారు. బాండ్ విలువ మేరకు వడ్డీ అందుకుంటారు. గడువుతీరే సమయానికి బంగారానికి మార్కెట్‌లో ఎంత విలువ ఉంటే అంత మొత్తాన్ని పొందే గ్యారంటీ ఉంటుంది. బాండ్‌ల ద్వారా కొనుగోలు చేసిన 147 మెట్రిక్ టన్నుల బంగారానికి ఇప్పటి మార్కెట్ రేటును చెల్లించాలంటే.. ప్రభుత్వం రూ.1,00,000 కోట్లు నష్టపోతుంది. కానీ, జీఎంఎస్ భిన్నమైనది. సరైనరీతిలో మెరుగుపరిస్తే జీఎంఎస్‌లో ప్రజలకు, ప్రభుత్వ ఖజానాకూ మంచి లాభావకాశాలున్నాయి. జీఎంఎస్‌లో తమ బంగారాన్ని యథాతథంగా (భౌతిక వస్తురూపంలో) ప్రజలు బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. సురక్షితమైన వడ్డీ ఖాతాను ప్రారంభిస్తారు. ఏటా కొద్దిమొత్తం వడ్డీని ఆర్జిస్తారు. గడువు తీరాక, డిపాజిటర్‌కి బంగారాన్ని డబ్బు రూపంలోనో బంగారు కడ్డీలు, నాణేల రూపంలోనో వడ్డీతో సహా చెల్లిస్తారు. ఇందులో బ్యాంకులకు రిస్క్ చాలా తక్కువ. డిపాజిట్ చేసిన బంగారాన్ని కొంతమేర డిమాండ్‌ను బట్టి దేశీయ మార్కెట్‌కి మళ్లించవచ్చు. దీనివల్ల పసుపు లోహాన్ని దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఉండదు. విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని కోల్పోనక్కర్లేదు. ఈ పథకాన్ని గనక సులభతరం చేసి, డిపాజిట్‌దార్లకు తేలిగ్గా ఉండేలా ప్రక్రియను మారిస్తే.. బంగారాన్ని గణనీయ మొత్తంలో బ్యాంకులు ఆకర్షిస్తాయి. ప్రయివేటు పౌరులను, కుటుంబాలను దొంగ-పోలీస్ తరహా ప్రశ్నలు అడగకుండా; ఇళ్లలోని బంగారాన్ని వెల్లడించినందుకు పన్నులు విధించకుండా ఉంటేనే అది సాధ్యమవుతుంది. సంఘటిత నేర ముఠాలు అవినీతి సొమ్మును చెలామణిలోకి తెచ్చుకోకుండా జీఎంఎస్‌లో తగిన జాగ్రత్తలని తీసుకోవాలి.

# దేశవ్యాప్తంగా ముగిసిన బక్రీద్ ప్రార్థనలు..

# మత సామరస్యాన్ని చాటిన వేడుకలు

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ : త్యాగానికి ప్రతీకగా నిలిచే ఈద్-ఉల్-అజ్హా (బక్రీద్) పండుగను దేశవ్యాప్తంగా ముస్లింలు ఇవాళ (గురువారం) అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకుంటున్నారు. ఉదయాన్నే మసీదులు, ఈద్గాలకు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు (నమాజ్) నిర్వహించారు. దేశంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు, స్థానిక యంత్రాంగాలు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాయి.

**ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రత - సోదరభావం చాటిన భక్తులు**

ఢిల్లీలోని చరిత్రాత్మక జామా మసీదు, ఫతేపురి మసీదులతో పాటు ప్రధాన ఈద్గాల వద్ద వేలాది మంది నమాజ్ చేశారు. ప్రార్థనల అనంతరం భక్తులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఢిల్లీ జాయింట్ పోలీస్ కమిషనర్ మధుర్ వర్మ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ.. ఇప్పటివరకు పండుగ వేడుకలు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా అత్యంత ప్రశాంతంగా ముగిశాయని తెలిపారు.

**ఉత్తరప్రదేశ్‌లో గంగా-జమునా తెహజీబ్**

ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో హిందూ-ముస్లింల మధ్య ఉన్న శతాబ్దాల నాటి మత సామరస్యం మరోసారి కనిపించింది. ఇక్కడి ఒక స్థానిక దేవాలయం, ఈద్గా ఒకే ఉమ్మడి గోడను పంచుకుంటున్నాయి. ఆలయ నిర్వాహకుడు ఓం ప్రకాష్ మాట్లాడుతూ.. 'తరతరాలుగా ఇక్కడ హిందూ, ముస్లింలు ఎంతో సామరస్యంగా జీవిస్తున్నారు. ఒకవైపు ఆలయంలో పూజలు, మరోవైపు ఈద్గాలో నమాజ్ ఎలాంటి వివాదాలు లేకుండా ప్రశాంతంగా జరుగుతాయి' అని పేర్కొన్నారు.

**తెలుగు రాష్ట్రాల్లో మిన్నంటిన బక్రీద్ వేడుకలు.. ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు :** త్యాగానికి, భక్తికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ వేడుకలు



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. ఈ ఉదయాన్నే ముస్లింలు సాంప్రదాయ దుస్తులు ధరించి స్థానిక మసీదులు, ఈద్గాలకు భారీగా తరలివచ్చారు. హైదరాబాద్‌లోని చారిత్రాత్మక మక్కా మసీదు, మీర్‌ఆలం ఈద్గా, సికింద్రాబాద్ ఈద్గా తదితర ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. ఏపీలోని విజయవాడ, కర్నూలు, గుంటూరు, కడప వంటి ప్రధాన నగరాల్లోని ఈద్గాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మత గురువులు (ఇమామ్‌లు) ప్రత్యేక ప్రార్థనలు చేయించి, పండుగ విశిష్టతను, ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక దువా చేశారు. పండుగ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో మత సామరస్యం ఉట్టిపడింది. ముస్లిం సోదరులకు హిందూ బంధువులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. నమాజ్ పూర్తయిన తర్వాత ముస్లింలు తమ ఇళ్లలో సాంప్రదాయబద్ధంగా 'ఖుర్బానీ' (బలి) ఇచ్చి, ఆ మాంసాన్ని మూడు భాగాలుగా చేసి బంధువులకు, మిత్రులకు, పేదలకు పంపిణీ చేశారు.

## వంతెన నిర్మాణ పనులను పర్యవేక్షించిన మంత్రి

మక్తల్ : మక్తల్ నియోజకవర్గం ఉట్కూరు మండలం మల్లేపల్లి గ్రామం వద్ద 2 కోట్లతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను మంత్రి వాకిటి శ్రీహరి పర్యవేక్షించారు. నిర్మాణ పనుల గురించి ఇంజినీర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనులు వేగవంత అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నెలలోపు వంతెన పూర్తి అయ్యి అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు.




## బక్రీద్‌కు పటిష్ట బందోబస్తు.. ఈద్గా వద్ద ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి: బక్రీద్ పండుగ నేపథ్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలోని ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ శ్రీమతి డి. జానకి ఐపీఎస్ గురువారం పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చేపడుతున్న చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.పండుగ సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా పనిచేస్తోందని ఎస్పీ తెలిపారు. జిల్లాలోని అన్ని ఈద్గా ప్రాంగణాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో ప్రార్థనలు నిర్వహించుకునేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, ముఖ్యంగా ముస్లిం సోదర సోదరీమణులకు జిల్లా ఎస్పీ డి. జానకి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను సోదరభావంతో, శాంతియుత వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ తనిఖీల్లో అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు,



డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మోతిరాం, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




హైదరాబాద్ : తప్పుడు ధృవీకరణ పత్రాలతో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించిన ఓ మహిళా టీచర్ వ్యవహారం మెదక్ జిల్లాలో సంచలనంగా మారింది. నకిలీ క్యాస్ట్ సర్టిఫికెట్, నాన్-క్రిమిలేయర్ సర్టిఫికెట్లను సమర్పించి ప్రభుత్వ ఉద్యోగం పొందినట్లు తేలడంతో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కీలక చర్యలు తీసుకున్నారు. సంబంధిత సర్టిఫికెట్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**అసలేం జరిగిందంటే :**

2024 డీఎస్సీ నోటిఫికేషన్‌లో బీసీ-ఈ కేటగిరీ కింద ఐదు ఎస్జీటీ పోస్టులు కేటాయించబడ్డాయి. టేక్మాల్ మండలం తంపులూరు గ్రామానికి చెందిన దూదేకుల సనాబేగం అనే అభ్యర్థి బీసీ-ఈ క్యాస్ట్ సర్టిఫికెట్, నాన్-క్రిమిలేయర్ ధృవీకరణ పత్రాల ఆధారంగా టీచర్ ఉద్యోగాన్ని పొందారు. ప్రస్తుతం ఆమె అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

**ఫిర్యాదుతో బయటపడ్డ అసలు నిజం!**

సనాబేగం నిజానికి బీసీ-బి కేటగిరీకి చెందిన దూదేకుల సామాజిక వర్గానికి చెందినవారని, కానీ తప్పుడు మార్గంలో బీసీ-ఈ (షేక్ సామాజిక వర్గం) సర్టిఫికెట్ పొందారని పాపన్నపేట మండలానికి చెందిన మహమ్మద్ నవాజ్ అనే మరో అభ్యర్థి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆధారాలతో కూడిన ఫిర్యాదు అందడంతో అధికారులు విచారణ చేపట్టారు.

**కలెక్టర్ యాక్షన్ :** ఫిర్యాదుపై స్పందించిన రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ నిర్వహించారు. విచారణలో సనాబేగం సమర్పించిన క్యాస్ట్, నాన్-క్రిమిలేయర్ సర్టిఫికెట్లు తప్పుడు సమాచారం ఆధారంగా పొందినట్లు నిర్ధారణ కావడంతో, అధికారులు నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దీంతో స్పందించిన మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మంగళవారం రోజున సంబంధిత సర్టిఫికెట్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అర్హులైన అభ్యర్థుల అవకాశాలను హరించి అక్రమంగా ఉద్యోగాలు పొందే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

## రిజిస్ట్రేషన్‌ల రద్దీ దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పనివేళల పొడిగింపు

**జూన్ 3 వరకు ఉదయం 9.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు సేవలు**

వనపర్తి, సమయం ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మార్కెట్ విలువల సవరణ నేపథ్యంలో రిజిస్ట్రేషన్‌ల సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు వనపర్తి సబ్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ స్లాట్ల సంఖ్యను పెంచడంతో పాటు కార్యాలయ పనివేళలను ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు పొడిగించినట్లు ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రత్యేక ఏర్పాట్లు ఈ నెల 29వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రస్తుత మార్కెట్ విలువల ప్రకారం తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని సబ్ రిజిస్ట్రార్ సూచించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా అవసరమైన పత్రాలు సిద్ధం చేసుకుని కార్యాలయాలను సందర్శించాలని కోరారు.








# బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక : ప్రభుత్వ విప్

**సమయం ప్రతినిధి మహబూబ్‌నగర్ :** పవిత్ర బక్రీద్ (ఈద్–ఉల్–అజ్హా) పర్వదినాన్ని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ నగరంలోని మయూరి పార్కు వద్ద గల హైలే హద్దీస్ ఈద్గా వద్ద ఘనంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ & ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే ముస్లిం సోదరులకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పర్వదినం త్యాగం, నిస్వార్థత, దానధర్మాల ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. సమాజంలో పరస్పర ప్రేమ, సౌహార్దం, సహనం పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. సమాజంలో మత భేదాలు లేకుండా అందరూ కలిసిమెలిసి జీవించడం ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి పండుగ మనలోని మానవత్వాన్ని, సేవాభావాన్ని పెంచేందుకు దోహదపడుతుందని చెప్పారు. ముఖ్యంగా బక్రీద్ పర్వదినం మనకు త్యాగం, పరస్పర సహకారం, పేదలకు సహాయం చేయడం వంటి విలువలను గుర్తు చేస్తుందని ఆయన అన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముఖ్యంగా విద్యా రంగంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, డిజిటల్ లెర్నింగ్ సెంటర్ల స్థాపన, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పన వంటి చర్యలతో విద్యా రంగాన్ని బలోపేతం చేస్తున్నామని వివరించారు. అలాగే, సమాజంలో శాంతి, సామరస్య వాతావరణం నెలకొనాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. చిన్న చిన్న విభేదాలను పక్కనబెట్టి సోదరభావంతో



జీవిస్తేనే సమాజం ముందుకు సాగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్ బిన్ బదర్, మహ్మద్ సలీమ్, జియౌద్దీన్ సైఫ్, నేమతుల్లా సాబ్, జాబేర్ బిన్ సయీద్, ఇస్సా అమోధి తదితరులు పాల్గొన్నారు.

**బక్రీద్ పండుగ ఐక్యతకు చిహ్నం**

బక్రీద్ పండుగ ఐక్యతకు చిహ్నం అన్నారు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి. బక్రీద్ పండుగ సందర్భంగా న్యూ గంజ్, రహమానియా ఈద్గా దగ్గర జరిగిన ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొని, ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బక్రీద్



పండుగ త్యాగానికి, నిస్వార్థ సేవకు ప్రతీక అని ఆయన చెప్పారు. ఈ పర్వదినం మనలో సేవాభావం పరస్పర సహకారం వంటి విలువలతో కులమతాలకు అతీతంగా స్నేహపూర్వకంగా సహనంతో జీవిద్దామని ఆయన పిలుపునిచ్చారు. మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్లు షబ్బీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## కంకర వేశారు దాంబర్ వెయ్యడం మరిచారు





**జోగులాంబ గద్వాల జిల్లా, సమయం ప్రతినిధి :** మల్దకల్ మండలంలోని మంగపేట విలేజిలో సద్ద లోనిపల్లినుండి మంగంపేటకు వెళ్లే రహదారి గత రెండు నెలల కిందట కాంటాక్ట్ రోడ్డుకు కంకర వేయడం జరిగింది. దాంట్లో భాగంగా గత రెండు నెలల నుండి రోడ్డుపై కంకర మాత్రమే వేశారు. ఈ కంకర వేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు ప్రధానంగా సద్దనోని పల్లి మంగంపేట ప్రధాన రహదారి కావడంతో రోజుకి ఎన్నో వాహనాలు ఈ రోడ్డుపై తిరుగుతుండడంతో కంకర రోడ్డుపై ఉండడంతో వాహనదారులు వాహనాలు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు వెంటనే కాంటాక్ట్ గాని అధికారులు కానీ వెంటనే స్పందించి మా గ్రామానికి దాంబర్ రోడ్డు వెయ్యాలని గ్రామస్తులు డిమాండ్ చేయడం జరిగింది.

## తృణమూల్ ఇక చరిత్రేనా...

కోల్ కత్తా : పశ్చిమ బెంగాల్‌ను 15 ఏళ్లు ఏకచత్రాధిపత్యంగా పాలించారు మమతా బెనర్జీ. అక్కడి కమ్యూనిస్టు పాలకుల రికార్డును చెరిపేయాలని ప్రయత్నించారు. కానీ అమె అనుసరించిన విధానాలు, భారత వ్యతిరేక ధోరణి, వసలవాదుల అనుకూల వైఖరి, ఇటీవల జరిగిన ఎన్నికల్లో మమతతోపాటు, తృణమూల్ కాంగ్రెస్‌ను బెంగాలీలు చిత్తుగా ఓడించారు. అధికారం కోల్పోవడంతో పార్టీలో ఇప్పుడు లుకలుకలు మొదలయ్యాయి. అధినేత్రి అదేశాలను కూడా గెలిచిన ఎమ్మెల్యేలు లెక్క చేయడం లేదు. దీంతో మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఎన్నికలు ముగిసిన వెంటనే పార్టీలో ఉత్పన్నమైన అసంతృప్తి, నాయకుల వలసలు, సంస్థాగత బలహీనతలు మమతా ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారాయి. ఇటీవలి ఎన్నికల తర్వాత టీఎంసీ ఆహ్వానించిన ధర్నా కార్యక్రమం పార్టీ బలహీనతను బహిర్గతం చేసింది. మొత్తం ఎమ్మెల్యేలలో కేవలం 40 శాతం మంది మాత్రమే పాల్గొనడం ద్వారా పార్టీలోని వ్యతిరేకత స్పష్టమైంది. తర్వాతి ఎమ్మెల్యేల సమావేశాల్లో హాజరు ఇంకా తగ్గి, 25వ తేదీ నాటికి 40 మందికిపైగా గైర్హాజరు అయ్యారు. హాజరైన ఎమ్మెల్యేలు పార్టీ నిర్వహణను తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా అభిషేక్ బెనర్జీ నాయకత్వ సామర్థ్యంపై ప్రశ్నలు లేవనెత్తారు. ఫాల్తా నియోజకవర్గం (అభిషేక్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని) అభ్యర్థి జహంగీర్ ఖాన్ విషయంలో తీసుకున్న నిర్ణయం కూడా తీవ్ర అసంతృప్తికి దారితీసింది. ఇది పార్టీలో కుటుంబ ప్రాధాన్యతలపై ఉన్న వ్యతిరేకతను ప్రతిబింబిస్తుంది. పార్టీ సంక్షోభం అసెంబ్లీ స్థాయిలో మాత్రమే కాకుండా స్థానిక సంస్థల వరకు వ్యాపించింది. ఎన్నికలు ముగిసిన వెంటనే ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీని వీడగా, మున్సిపల్ కౌన్సిలర్లు కూడా బయటకు వస్తున్నారు. ఈ వలసలు టీఎంసీ గ్రాస్‌రూట్ స్థాయి బలాన్ని బలహీనపరుస్తున్నాయి.

# రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా మోసం చేసింది...

**అకాల వర్షానికి తడిసి,మొలకెత్తిన వడ్లను సందర్శించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు**



**సమయం ప్రతినిధి గద్వాల :** గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండల కేంద్రంలో మొన్న కురిసిన అకాల వర్షానికి తడిసి,మొలకెత్తిన ధాన్యాన్ని(వడ్ల)ను పార్టీ నాయకులతో కలిసి,బాసు హనుమంతు నాయుడు పరిశీలించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..**

రైతులు ఎన్నో ఆశలతో తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే అక్కడ రోజుల తరబడి పంటను రోడ్లపైనే పడేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు...ఇక ఇదే సమయంలో అకాల వర్షాలు కురవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద పేరుకుపోయిన వడ్లు పూర్తిగా తడిసి మొలకెత్తాయని,రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని తెలిపారు. కష్టపడి పండించిన పంట కళ్లముందే నాశనం అవుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తూ రైతుల జీవితాలతో ఆడుకుంటోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు... పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెస్తే గన్ని బ్యాగులు,హమాలి,లారీలు లేక రోజులు తరబడి కేంద్రాల్లో రైతులు పడికాపులు కాసే పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు....రైతులు ఎదుర్కొంటున్న దారుణ పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. గత 25 రోజుల నుంచి వడ్లను కొనుగోలు కేంద్రంలో ఉంచిన, మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో కర్ణాటక రాష్ట్రం రాయచూర్ రైస్ మిల్ ప్రైవేట్ దళారులకు రైతులు వడ్లు అమ్ముకుంటున్నారు...రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో వడ్లు కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షానికి రైతులు తీవ్ర నష్టపోయారని ఆరోపించారు...అకాల వర్షానికి తడిసి, మొలకెత్తిన వడ్ల రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పటేల్ జనార్దన్ రెడ్డి, శేఖర్ నాయుడు,చక్రీధర్ రెడ్డి,వెంకటేష్ నాయుడు,తిమ్మప్ప గౌడ్,రాముడు, పూడూరు రఘు నాయుడు,రమేష్, డ్యామ్ శ్రీను,రాము,వినయ్,తిమ్మప్ప, హరి కృష్ణ, మధు,మోహన్,భాస్కర్, నాగరాజు,కృష్ణ,రాజు,మహేష్ మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో లారీలు, గన్నీ బ్యాగుల కొరతపై డీఏవో ఆరా

# మూసాపేట మండలంలో వరి కొనుగోలు కేంద్రాల పరిశీలన



**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి :** మూసాపేట మండలంలోని పలు వరి కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేష్ గురువారం సందర్శించి కొనుగోళ్ల తీరును పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని తక్షణ చర్యలకు సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. వేముల, కొమిరెడ్డిపల్లి, మహమ్మద్ హుస్సేన్ పల్లి, నందిపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలింపులో ఇబ్బందులు ఉన్నాయని రైతులు జిల్లా వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకువచ్చారు. వేముల కొనుగోలు కేంద్రంలో ఇంకా రెండు లారీలు అవసరమని రైతులు కోరగా, కొమిరెడ్డిపల్లి కేంద్రంలో ఒక లారీ అవసరమని రైతులు, కేంద్ర ఇన్‌చార్జి తెలిపారు. మహమ్మద్ హుస్సేన్ పల్లి కేంద్రంలో 6,000 గన్నీ బ్యాగులు, అదనంగా ఆరు లారీలు అవసరమని రైతులు వివరించారు. కొన్ని లారీలు, ట్రాక్టర్లు రైస్ మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ ఆలస్యం కారణంగా నిలిచిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై పౌర సరఫరాల శాఖ అధికారులతో మాట్లాడి లారీలు, గన్నీ బ్యాగుల సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు. అదేవిధంగా, ఆన్లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఓపీఎంఎస్)లో పెండింగ్ ఎంట్రీలను వెంటనే నమోదు చేసి రైతులకు ధాన్యం చెల్లింపులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.





# బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి శ్రీహరి

మక్తల్ : ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మక్తల్ లోని ఈద్గా వద్ద ప్రార్థనల అనంతరం వారిని ఆత్మీయంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సేవా భావం, మానవత్వానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ సమాజంలో సౌభ్రాతృత్వాన్ని, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి, సామరస్య వాతావరణంలో పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నిండాలని, రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు.



## అన్నదాతలకు న్యాయం చేయకుంటే కలెక్టర్ రేట్ ముట్టడిస్తాం

**బిఆర్ఎస్ పార్టీ గద్వాల ఇన్చార్జి బాసు హనుమంతు నాయుడు**



గద్వాల్, సమయం ప్రతినిధి : రాబోయే రెండు రోజుల్లో జిల్లాలోని కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి లారీల ద్వారా తరలించకపోతే భరసా ఆధ్వర్యంలో కలెక్టర్ రేట్ ను ముట్టడిస్తామని బిఆర్ఎస్ పార్టీ గద్వాల ఇన్చార్జి బాసు హనుమంతు నాయుడు హెచ్చరించారు. గురువారం మల్దకల్ లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెస్తే గోనె సంచులు, హమాలీలు, లారీలు లేక రోజుల తరబడి కేంద్రాలలో రైతులు పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే అక్కడ గన్ని బ్యాగులు, టాబ్ ఫారములు లేక హమాలీలు లేక, కొన్న ధాన్యాన్ని తరలించడానికి లారీలు కూడా లేకపోవడంతో రైతులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. దీనికి తోడు అకస్మతిగా వచ్చే ఆకాల వర్షాలకు దాన్యం పూర్తిగా తడిసిపోవడంతో పాటు కొన్నిచోట్ల మొలకలు రావడంతో రైతు పరిస్థితి దారుణంగా తయారయ్యిందని విమర్శించారు. రైతు సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా గాలి కొదిలేసిందని ఆరోపించారు. వీరి వెంట బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు జనార్దన్ రెడ్డి, డి. శేఖర్ నాయుడు, నరసింహులు, కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పర్వదినం నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను

# పరిశీలించిన జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

**ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ**

**బందోబస్తు విధుల్లో అప్రమత్తంగా పనిచేయాలని అధికారులకు ఆదేశాలు**

**జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ముగిసిన పవిత్ర ప్రార్థనలు**

వనపర్తి : గురువారం రోజు వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలనగర్ ఈద్గా మైదానం వద్ద బక్రీద్ పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన బందోబస్తు విధులను జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. బక్రీద్ పర్వదినాన్ని జిల్లా ప్రజలు పరస్పర సౌభ్రాతృత్వం, శాంతి సామరస్యాల మధ్య ఆనందంగా జరుపుకోవడం సంతోషకరమని తెలిపారు. ముస్లిం సోదరులందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజంలో ఐక్యత, ప్రేమాభిమానాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా మసీదులు, ఈద్గా మైదానాల వద్ద పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించారని తెలిపారు. ప్రజల



సహకారంతో జిల్లా అంతటా పవిత్ర ప్రార్థనలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యాయని ఎస్పీ పేర్కొన్నారు. పండుగ సందర్భంగా ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, వనపర్తి సిఐ, సుగంధ రత్నం, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై,సురేందర్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## షర్మిళకు రాజ్యసభ..

కడప : దేశవ్యాప్తంగా రాజ్యసభ ఎన్నికల సందడి కనిపిస్తోంది. పది రాష్ట్రాల నుంచి 24 మంది ఎంపీలు పదవీ విరమణ చేస్తున్నారు. వారి స్థానంలో కొత్త వారి ఎంపికకు సంబంధించి ఎన్నికలు జరగనున్నాయి. ఏపీ నుంచి నలుగురు సభ్యులు పదవీ విరమణ చేయనుండగా.. ఆ పదవులన్నీ కూటమి ఖాతాలోనే పడనున్నాయి. మరోవైపు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలకు సైతం రాజ్యసభ పదవి ఖాయమని ప్రచారం నడుస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో రాజశేఖరరెడ్డి కుటుంబాన్ని కాంగ్రెస్ వైపునకు తిప్పేందుకు షర్మిల కు ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది. ప్రధానంగా ఆమెను కర్ణాటక నుంచి రాజ్యసభకు ఎంపిక చేస్తారని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతానికి ఆమెకు సానుకూలమైన వాతావరణం ఉన్నట్లు తెలుస్తోంది.కర్ణాటక నుంచి ముగ్గురు సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. ఆ మూడు పదవులు కాంగ్రెస్ పార్టీకి దక్కనున్నాయి.

# బెదిరింపులకు భయపడం ప్రతిఘటనా ఉద్యమాలతో బలపడతాం

హైదరాబాద్ : సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు విజయన్ ఇండ్లపై ఈడీ దాడులను నిరసిస్తూ ఆర్టీసీ క్రాస్ రోడ్డులో సీపీఐ(ఎం) ప్రదర్శన ఈడీ..మోడీ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు బీజేపీ దుర్మార్గాలకు, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్న తమ పార్టీ నాయకులను కేసులతో భయపెట్టడం, బెదిరింపులకు దిగడం వంటి చర్యలకు మోడీ సర్కారు పూనుకున్నదని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు విమర్శించారు. బెదిరింపులకు, కేసులకు భయపడబోమనీ, ప్రతిఘటనా ఉద్యమాలతో మరింత బలపడతామని నొక్కి చెప్పారు. కేరళం మాజీ సీఎం పినరయి విజయన్‌పై ఈడీ దాడులను నిరసిస్తూ గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఎంబీ భవన్ (సీపీఎం రాష్ట్ర కార్యాలయం) నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. 'ఈడీ, మోడీ గో బ్యాక్ గోబ్యాక్..., పినరయి విజయన్ ఇంటిపై ఈడీ దాడిని ఖండించండి..ఖండించండి..., మోడీ, ఈడీ డౌన్‌డౌన్..., బీజేపీ రాజకీయ కక్ష? సాధింపు చర్యలను అడ్డుకుందాం..అడ్డుకుందాం..' అంటూ నినాదాలు చేశారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద నిరసనలో రాఘవులు మాట్లాడుతూ..కేరళం మాజీ సీఎం, పొలిట్ బ్యూరో సభ్యులు పినరయి విజయన్‌పై ఒక్క అవినీతి కేసు కూడా లేదన్నారు. ఈడీ చెబుతున్న కేసులో నిందితులుగానీ, ఆ సంస్థగానీ ఏనాడూ విజయన్ పేరును ప్రస్తావించలేదని ఎత్తిచూపారు. ఇది ముమ్మాటికీ రాజకీయ దాడేనని తేల్చిచెప్పారు. విచారణల పేరుతో దాడులు చేయడం వామపక్షాను, సీపీఐ(ఎం)ను దెబ్బతీయడంలో భాగమేనన్నారు. కేంద్ర దర్యాపు సంస్థలతో దాడులు చేయించడం బీజేపీకి కొత్తగాదనీ, బీజేపీకి ఆటంకంగా మారిన కేజ్రీవాల్, సిసోడియా, ఆప్ నేతలు, జార్ఖండ్ సీఎం సోరెన్, తదితరులపై ఈడీని ప్రయోగించి రాజకీయంగా అణచివేసిందని విమర్శించారు. మరికొందరు నేతలను తనవైపు తిప్పుకుని, లొంగదీసుకుని సీఎంలను చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ కేసులు పెట్టి విచారణల పేరుతో కోర్టుల చుట్టూ తిప్పిందని గుర్తుచేశారు. ప్రజలకు, ప్రతిపక్షాలకు విమర్శించే హక్కు, ప్రశ్నించే గొంతుకలు ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులను సీపీఐ(ఎం) ఖండిస్తూ వస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ నిధులను ఐటీ స్తంభింపజేస్తే కూడా సీపీఐ(ఎం) ఖండించిందని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రజలను సమీకరించి ప్రతిఘటించే ఉద్యమాలు చేసే సీపీఐ(ఎం) నాయకులపై ఈ విధంగా దాడులు జరుగుతుంటే కాంగ్రెస్ నేతల మౌనం వెనుక మర్మం ఏంటని ప్రశ్నించారు. కేరళంలో సీపీఐ(ఎం) బలహీనం చేయాలనే దుర్మార్గపూరిత ఆలోచనతో కాంగ్రెస్, బీజేపీలు కలిపి ఈ దాడికి ఉసిగొల్పాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని విమర్శించారు. ఇటీవల కొత్త ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ప్రధాని మోడీని కలిసినప్పుడు విజయన్‌ను అరెస్టు చేయాలని ఒత్తిడి తెచ్చారనే అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు. విజయన్‌ను అరెస్టు చేయాలని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో డిమాండ్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రజాస్వామ్యం ముఖ్యమా? బీజేపీ నియంతృత్వానికి సహకరించడం ముఖ్యమా? అనే విషయాన్ని కాంగ్రెస్ తేల్చుకోవాలని సూచించారు. ఢిల్లీలో సీపీఐ(ఎం) అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, తదితరులు నిరసన తెలియజేసినందుకు అరెస్టు చేసి నిర్బంధించడాన్ని తప్పుబట్టారు. విజయన్‌పైనే కాదు ఇంకెంత మంది సీపీఐ(ఎం) నాయకులపై కేసులు పెట్టి వేధించినా బీజేపీకి, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక, లౌకిక శక్తులను కలుపుకుని సీపీఐ(ఎం) పోరాడుతుందని స్పష్టం చేశారు. ఆ పోరాటంలో



కలిసి రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ..పినరయి విజయన్‌పై ఈడీ దాడులను ఖండిస్తున్నామన్నారు. ప్రతిపక్ష పార్టీలను దెబ్బతీసి అప్రతిష్టపాలు చేయడానికి అక్రమ కేసులు పెట్టడం, పార్టీలను చీల్చడం వంటి నియంతృత్వధోరణులను కొనసాగించడానికి రాజ్యాంగ సంస్థలను బీజేపీ వాడుకుంటున్నదని విమర్శించారు. ఇలాంటి దాడులు జరుగుతుంటే కాంగ్రెస్ పార్టీ గమ్మగా ఉంటే ఆ పార్టీ మరింత నిర్వీర్యం అవుతుందని హెచ్చరించారు. మోడీ సర్కారు అప్రజాస్వామిక విధానాలను మేధావులు, ప్రజాస్వామికవాదులు, ప్రజలు ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి, ఎస్.వీరయ్య, జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి(మాజీ ఎమ్మెల్యే), చుక్క రాములు, టి.సాగర్, పాలడుగు భాస్కర్, అబ్బాస్, మల్లులక్ష్మి, బండారు రవికుమార్, పి.ప్రభాకర్, నున్నా నాగేశ్వర్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు, హైదరాబాద్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను రైతులు నిలదీయండి





**-పాలన ఇలాగే కొనసాగితే రైతుల పక్షాన పోరాటం చేస్తాం**
**మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పిలుపు**

**సమయం ప్రతినిధి మహబూబ్ నగర్:** మహబూబ్‌నగర్ మండల పరిధిలోని మిల్లు ను పరిశీలించి రైతులతో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. రైతులను కదిలిస్తే కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ప్రభుత్వం పంట కొనుగోలు చేయక పోవడంతో వర్షానికి పంట తడిసింది. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నది..కానీ మంచిగా ఉన్న ధాన్యం కూడా కొనడం లేదు. క్షేత్ర స్థాయిలో వాస్తవాలను ప్రభుత్వం తెలుసుకోవాలని సూచించారు. రోహిణి కార్తె రావడంతో పంటలు వేసుకునేందుకు రైతులు సిద్ధం అవుతుంటే కనీసం పిండి సంచులు లేవని, రైతు బంధు లేదు.. రుణ మాఫీ లేదు.. సకాలంలో కరెంటు ఇవ్వలేదు.. ఆరుగాలం కష్టం చేసి పండిన పంట కూడా కొనుగోలు చేయడం లేదన్నారు. పాలమూరు పనులు పూర్తి చేసేందుకు పిలిచినా టెండర్లు రద్దు చేసారు. ప్రాజెక్ట్ పూర్తి చేయమంటే మంత్రులు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారన్నారు. నకిలీ పత్తి విత్తనాలను మార్కెట్‌లో రాకుండా అధికారులు చూడాలన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని..రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు కొనుగోలు చేయడంతో పాటు పిండి సంచులు సకాలంలో ఇవ్వాలని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను నిలదీయండని పిలుపునిచ్చారు. కెసిఆర్ గశ్రీ ప్రభుత్వం రైతు ప్రభుత్వం.. మేము అధికారంలో ఉన్నప్పుడు రైతులకు అన్ని అందుబాటులో పెట్టాము..పంట కొనుగోలు చేసి బోనస్ ఇచ్చాము.. రైతు బందు సకాలంలో విడుదల చేసాము.. కాంగ్రెస్ వచ్చి రెండున్నర యేండ్లు ఐన రైతులకు చేసిందేమి లేదు..ఇదే రకమైన పాలనా కొనసాగితే రైతుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. మాజీ మంత్రి వెంట గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మండల సీనియర్ నాయకులు మల్లు నర్సింహా రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# త్యాగం ప్రేమకు ప్రత్యేక బక్రీద్ : మాజీమంత్రి





**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి :** మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, ప్రేమ, భక్తికి ప్రతీక బక్రీద్ అని,అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలని అన్నారు. భక్తి శ్రద్దలతో జరిపే అందరి ప్రార్ధనలు ఫలించాలని తెలిపారు. తెలంగాణాలో కుల, మతాల ఐక్యతను పెంచిన ఘనత కేసీఆర్ దేనని,ఆయన హయాంలోనే పండుగలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయని పేర్కొన్నారు. గంగా,జమున తహజీబ్‌లా తెలంగాణాలో అన్ని మతాలు కలిసిమెలసి జీవిస్తున్నామని అన్నారు. గత పదమూడేండ్లుగా పండుగలన్నీ ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటున్నామని,ఇదే సంస్కృతిని ముందు తరాలకు అందేలా కొనసాగించుకుం దామని పిలుపునిచ్చారు.

## కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్
## పినరాయ్ విజయన్ ఇండ్లపై ఈడి దాడిని ఖండించండి.... CPM




**సమయం ప్రతినిధి వనపర్తి :** అమరచింత మండల కేంద్రంలో నిరసన నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి వెంకటేష్ ఎస్ రాజు అజయ్ రాఘవేంద్ర లు మాట్లాడుతూ ఈడి దాడులను ప్రజాస్వామ్యవాదులు. మేధావులు రాజకీయ నాయకులు ఖండించవలసిన అవసరం ఉందని వారు అన్నారు కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ విజయన్ కేరళ రాష్ట్రంలో నిరుపేదల కోసం రైతు కోసం కార్మికుల హక్కుల కోసం రాష్ట్రంలో పేదరికం లేకుండా చేసిన ముఖ్యమంత్రి వారు గుర్తు చేశారు నిజాయితీగా పేదల కోసం నిరంతరంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి పై బిజెపి ప్రభుత్వం కావాలని ఈడి దాడులు జరపడం సరైన విధానం ఈ దాడికి ప్రతి ఒక్కరు ఖండించాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు రవి శ్యాంసుందర్ కరుణాకర్ అంజి అరుణ్ కురువ మహేష్ డీసీ రాజేందర్ నరేందర్ అంజి తదితరులు పాల్గొన్నారు.

# భారంగా మారుతున్న పోలవరం పునరావాసం

ఏలూరు : ఆంధ్రప్రదేశ్లో నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి అత్యంత కీలకమైన జల ప్రాజెక్టులలో ఒకటిగా భావిస్తున్నారు. సాగునీరు, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి అవసరాలను తీర్చే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ప్రభుత్వం వేగంగా ముందుకు తీసుకెళ్తోంది. అయితే ప్రాజెక్టు నిర్మాణం ఎంత ముఖ్యమో, దాని ప్రభావిత ప్రాంతాల్లో పునరావాసం అంతకంటే పెద్ద సవాలుగా మారుతోంది. పోలవరం ప్రాజెక్టు కారణంగా అనేక గ్రామాలు ముంపు ప్రాంతాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతంలోని గ్రామాల ప్రజలు తమ ఇళ్లు, భూములు కోల్పోయే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తరతరాలుగా నివసిస్తున్న ప్రాంతాలను విడిచి వెళ్లాల్సి రావడంతో బాధిత కుటుంబాల్లో ఆందోళన పెరుగుతోంది. తమ జీవన విధానం పూర్తిగా మారిపోతుందనే భయం కూడా వారిలో కనిపిస్తోందిప్రభుత్వం పరిహారం, ఇళ్ల స్థలాలు, పునరావాస కాలనీలు కల్పిస్తున్నప్పటికీ అనేక మంది ఇంకా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భూముల విలువకు సరిపడా పరిహారం అందడం లేదని కొందరు చెబుతుంటే, కొత్త ప్రాంతాల్లో మౌలిక వసతులు సరిగా లేవని మరికొందరు అంటున్నారు. తాగునీరు, రహదారులు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి సదుపాయాలు పూర్తిస్థాయిలో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. వ్యవసాయం మీద ఆధారపడే కుటుంబాలకు పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది. పంట భూములు కోల్పోవడంతో జీవనోపాధి దెబ్బతింటోంది. కొత్త ప్రాంతాల్లో తిరిగి వ్యవసాయం ప్రారంభించడం అంత సులభం కాకపోవడంతో కొందరు ఇతర ఉపాధి మార్గాలను వెతుక్కోవాల్సి వస్తోంది. దీంతో ఆర్థిక ఒత్తిడి పెరుగుతోందని బాధితులు చెబుతున్నారు. పోలవరం వంటి భారీ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి అవసరమే అయినప్పటికీ, ప్రభావిత కుటుంబాల భవిష్యత్తును కూడా సమానంగా దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేవలం డబ్బు చెల్లించడం కాకుండా, స్థిరమైన జీవనోపాధి కల్పించడం ముఖ్యమని సూచిస్తున్నారు. అలాగే ప్రాజెక్టు ప్రాంత ప్రజలతో నిరంతరం చర్చలు జరపడం అవసరమని సామాజిక వర్గాలు చెబుతున్నాయి. వారి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కారాలు చూపితే వ్యతిరేకత తగ్గే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అధికారులు, ప్రజల మధ్య సమన్వయం లేకపోతే వివాదాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. ఇటీవల పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం అవుతున్న నేపథ్యంలో పునరావాస అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే రాష్ట్రానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. కానీ పునరావాసం సమర్థంగా అమలు కాకపోతే బాధితుల్లో అసంతృప్తి కొనసాగుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు మొత్తానికి పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు కీలకమైనదే అయినప్పటికీ, ప్రభావిత ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతినకుండా చూడటం కూడా అంతే ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. అభివృద్ధి, ప్రజల సంక్షేమం రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ఇలాంటి భారీ ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో విజయవంతమవుతాయని చెబుతున్నారు.

## వినూత్న నిర్ణయాలతో విజయ్...

చెన్నై : విజయ్ సినిమాలు విడుదలయితే తమిళనాడులో సరికొత్త రికార్డులు నమోదవుతాయి. బాక్స్ ఆఫీస్ వద్ద సరికొత్త వసూళ్లు సాధ్యమవుతాయి. కానీ, రీల్ లైఫ్ నుంచి రియల్ లైఫ్ కి వచ్చిన తర్వాత.. ముఖ్యమంత్రిగా మారిపోయిన తర్వాత విజయ్ తన స్టైల్ పూర్తిగా చేంజ్ చేసుకున్నారు. మేకోవర్ నుంచి మొదలు పెడితే పాలిటిక్స్ వరకు అన్నిట్లో గేమ్ చేంజింగ్ పర్సన్ అయిపోయారు. తమిళనాడులో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు విజయ్ ని మరో స్థాయికి తీసుకెళ్తున్నాయి. విజయ్ ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాలు సంచలనంగా మారాయి. ముఖ్యంగా కోయంబత్తూరు బాలిక ఘటనలో విజయ్ స్పందించిన తీరు యావత్ దేశాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. క్షణాల్లో విజయ్ తీసుకున్న నిర్ణయం బాలిక కుటుంబానికి న్యాయం చేసింది. అంతేకాదు ఈ ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు జైలు పాలయ్యేలా చేసింది.. ఇలా చెప్పుకుంటూ పోతే విజయ్ చేస్తున్న పరిపాలన.. తీసుకుంటున్న నిర్ణయాలు అచ్చం సినిమాల మాదిరిగానే ఉన్నాయి. తాజాగా విజయ్ తన రాష్ట్ర రైతులకు శుభవార్త చెప్పారు.. వారందరి సంక్షేమమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. రైతులకు సంబంధించిన 50 వేల వరకు రుణాలను పూర్తిగా మాఫీ చేస్తున్నట్టు విజయ్ ఉత్తర్వులు జారీ చేశారు. సాకార బ్యాంకులో గత ఏడాది మే 1 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకు రుణాలు తీసుకున్న వారందరికీ ఇది వర్తిస్తుందని విజయ్ స్పష్టం చేశారు. ఇంతటితోనే విజయ్ ఆగిపోలేదు. లక్ష రూపాయలు, అంతకు పైన రుణాలను ఐదు విభాగాలుగా విభజించి.. 20000, 15000, 10000, 5000 చొప్పున రుణాలను మాఫీ చేస్తున్నట్టు విజయ్ ప్రకటించారు. తద్వారా రైతుల మీద ఉన్న రుణ భారాన్ని తగ్గిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. తమిళనాడు రైతులకు విజయ్ తీసుకున్న నిర్ణయం ఎంతగానో ఉపయోగకరంగా ఉండనుంది. అంతేకాదు వారికి వ్యవసాయంలో మెరుగైన ఉత్పత్తి సాధించడానికి.. దోహదం చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల డిఎంకె అధినేత స్టాలిన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయ్ ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టుగా.. నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అయితే వీటిపై విజయ్ ఇంతవరకు స్పందించలేదు. కేవలం తన చేతల ద్వారా మాత్రమే స్టాలిన్ వ్యాఖ్యలకు సమాధానం చెబుతున్నారు. అన్నట్టుగానే ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తున్నారు. తద్వారా తాను మాటల ముఖ్యమంత్రిని కాదని.. చేతల ముఖ్యమంత్రినని నిరూపించుకుంటున్నారు విజయ్.

## సురవరం జీవితం సమాజానికి స్ఫూర్తిదాయకం



**మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి**

**సమయం ప్రతినిధి వనపర్తి:** మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వనపర్తి మొట్టమొదటి ఎం. ఎల్.ఏ సురవరం ప్రతాప్ రెడ్డి 130వ జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలలో నిష్ణాతులు,తెలుగు భాష పరిరక్షకుడు, సంఘ సంస్కర్త,సాహితీవేత్త, న్యాయవాది సురవరం.ప్రతాప్ రెడ్డి అని కొనియాడారు. సురవరం గారి జీవిత చరిత్ర సమాజానికి స్ఫూర్తిదాయకం కావాలని వారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమములో సాహితీ వేత్తలు,బి.ఆర్.ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# కేన్ ప్రపంచ రికార్డ్

స్పోర్ట్స్ డెస్క్: న్యూజిలాండ్ స్టార్ క్రికెటర్లు కేన్ విలియమ్సన్, టామ్ లాథమ్‌లు ఓ అరుదైన రికార్డును తమ పేరిట లిఖించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 12 విభిన్న దేశాలలో టెస్ట్ క్రికెట్ ఆడిన తొలి జంటగా వారిద్దరూ రికార్డులెక్కారు. ఐర్లాండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. బెల్‌ఫాస్ట్ వేదికగా ఐర్లాండ్‌తో జరుగుతున్న టెస్టు మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ భారీ స్కోర్ దిశగా దూసుకెళ్తోంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ 5 వికెట్ల నష్టానికి 361 పరుగుల భారీ స్కోర్ సాధించింది. క్రీజులో టామ్ బ్లండెల్(142), డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్(38) ఉన్నారు. అంతకంటే ముందు రచిన్ రవీంద్ర(121) సెంచరీతో సత్తాచాటాడు.

ఈ మ్యాచ్‌తో కేన్ విలియమ్సన్, టామ్ లాథమ్‌లు 12 విభిన్న దేశాలలో టెస్ట్ క్రికెట్ ఆడిన తొలి జంటగా రికార్డు సృష్టించారు. వీరికంటే ముందు ఈ ఇద్దరు ఆటగాళ్లు 11 దేశాలలో టెస్ట్ మ్యాచ్‌లు ఆడి షేన్ వార్న్, క్రిస్ గేల్, శివనారాయణ్ చందర్‌పాల్‌లతో పాటు పలువురు పాకిస్థాన్ దిగ్గజ ఆటగాళ్లతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉండేవారు. కానీ ఈ మ్యాచ్‌లో వారిందరిని కేన్, లాథమ్ అధిగమించారు. ఈ మ్యాచ్‌లో విలియమ్సన్ 36 పరుగులు చేసి పర్వాలేదనిపించగా... టామ్ లాథమ్ మాత్రం ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. విలియమ్సన్ 2010లో భారత్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా టెస్ట్ క్రికెట్‌లో అరంగ్రేటం చేశాడు. తన తొలి మ్యాచ్‌లోనే సెంచరీ సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. అతడి కెప్టెన్సీలో కివీస్ తొలి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(2021) టైటిల్‌ను సొంతం చేసుకుంది. విలియమ్సన్ ఇప్పటివరకు 109 టెస్టుల్లో 9,497 పరుగులు చేశాడు. లాథమ్ విషయానికి వస్తే..ఇప్పటివరకు 92 టెస్టులు ఆడి.. 16 సెంచరీలు, 31 అర్ధసెంచరీలతో 6,261 పరుగులు సాధించాడు.



# బెంగళూరును ఢీకొనేదెవరు?

ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026లో ఫైనల్ బెర్తు కోసం మరో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. ముల్లాన్‌పూర్ వేదికగా శుక్రవారం గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్ క్వాలిఫయర్ 2లో తలపడనున్నాయి. ఈ పోరులో నెగ్గిన జట్టు.. ఫైనల్‌కు చేరుకుంటుంది. ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించాల్సిందే. అయితే ఎలిమినేటర్‌లో బలమైన ఎస్ఆర్‌హెచ్‌ను ఓడించిన రాజస్థాన్.. భీకర ఫామ్‌లో ఉంది. మరోవైపు క్వాలిఫయర్ 1లో ఆర్సీబీ చేతిలో చిత్తుగా ఓడిన గుజరాత్.. మరో అవకాశం దక్కించుకుని విజయం కోసం ఎదురుచూస్తుంది. మరి ఇరుజట్ల సమీకరణాలు ఎలా ఉన్నాయంటే..

ఈ రెండు జట్ల మధ్య హెడ్ టూ హెడ్ రికార్డులు పరిశీలిస్తే.. గుజరాత్ టైటాన్స్‌దే స్పష్టమైన ఆధిపత్యం కనిపిస్తోంది. ఇప్పటి వరకు ఐపీఎల్‌లో ఇరుజట్లు 10 సార్లు తలపడ్డాయి. అందులో గుజరాత్ 7 సార్లు విజయం సాధించగా.. రాజస్థాన్ కేవలం మూడింట్లోనే గెలుపొందింది. మరి క్వాలిఫయర్ 2లో గుజరాత్‌పై రాజస్థాన్ నెగ్గుతుందా? ఓటమి సెంటిమెంట్‌ను చెరిపేస్తుందేమో చూడాల్సి ఉంది. కాగా ముల్లాన్‌పూర్‌లో రాజస్థాన్ రాయల్స్ ఇప్పటి వరకు ఆడిన ఏ మ్యాచులోనూ ఓడిపోలేదు. క్వాలిఫయర్ 2కి కూడా ఇదే వేదిక కావడం.. ఆర్ఆర్ బ్యాటర్లు వైభవ్ సూర్యవంశీ, ధ్రువ్ జురెల్ భీకర ఫామ్‌లో ఉండటంతో గుజరాత్ గెలుపు అంత సులువు కాదని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఎస్ఆర్‌హెచ్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో టాస్ ఓడినప్పటికీ తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్ఆర్.. 243 పరుగుల భారీ స్కోర్ చేయగలిగింది. ఆ స్కోర్‌ను డిఫెండ్ చేసుకుని ఎస్ఆర్‌హెచ్‌ను చిత్తుగా ఓడించి క్వాలిఫయర్ 2కి అర్హత సాధించింది.

అక్కడ సాయి సుదర్శన్.. ఇక్కడ వైభవ్!

టోర్నీ ఆరంభంలో వరుస విజయాలతో ప్లే ఆఫ్స్ రేసులోకి వచ్చిన రాజస్థాన్ రాయల్స్ ఆ తర్వాత గాడి తప్పింది. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ముంబైపై తప్పక గెలవాల్సిన పోరులో విజయం సాధించి.. ప్లే ఆఫ్స్‌కు చేరింది. బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న హైదరాబాద్‌ను ఎలిమినేటర్‌లో చిత్తు చేసింది. ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీ దూకుడుకు చెక్ పెట్టగలిగితేనే గుజరాత్‌కు గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అయితే గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. సిరాజ్, హోల్డర్, ప్రసిద్ధ్ కృష్ణ, రబాడా, రషీద్ ఖాన్ వంటి బౌలర్లు విజృంభిస్తున్నారు. వైభవ్ విధ్వంసాన్ని గుజరాత్ బౌలర్లు కట్టడి చేస్తారా? ఇదే ఫామ్‌ను కొనసాగిస్తూ రాజస్థాన్ ఫైనల్ చేరుకుంటుందా? అనేది చూడాల్సి ఉంది. కాగా ఈ పోరులో నెగ్గిన జట్టు ఆదివారం ఆర్సీబీతో ఫైనల్ సమరంలో తలపడనుంది.



# నీకు అభిమానిగా మారిపోయా!

ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై కేవలం 29 బంతుల్లో 97 పరుగులు చేసి మరోసారి సంచలనం సృష్టించిన ఈ 15 ఏళ్ల ఆటగాడిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇప్పటికే క్రిస్ గేల్ అత్యధిక సిక్సర్ల రికార్డును వైభవ్ బద్దలు కొట్టాడు. ఈ నేపథ్యంలో వెస్టిండీస్ స్టార్ ప్లేయర్ ఆండ్రీ రస్సెల్ వైభవ్‌ను సోషల్ మీడియా వేదికగా ప్రశంసించాడు. అతడికి పలు కీలక సూచనలు చేశాడు. 'నువ్వంటే నచ్చనివాళ్లు ఎన్నో విమర్శలు చేస్తారు. నీకు 15 ఏళ్లు కాదని అంటారు. వాళ్లను పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఇక్కడ 30 ఏళ్ల ఆటగాళ్లు కూడా నువ్వు సాధిస్తున్నది చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాగే కొనసాగు. నీ ఆటతీరును చూసి నేను నీకు అభిమానిగా మారిపోయాను. బౌలర్లను కాదు బంతిని చూడు.. బాదేయ్!' అంటూ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేశాడు. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ప్లేయర్‌గా వైభవ్ చరిత్ర సృష్టించాడు. ఈ సీజన్‌లో ఇప్పటికే 65 సిక్సర్లు కొట్టాడు. దీంతో 2012లో క్రిస్ గేల్ నెలకొల్పిన 59 సిక్సర్ల రికార్డును అతడు బ్రేక్ చేశాడు. ఆసక్తికరంగా రస్సెల్ కూడా ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు. 2019 సీజన్‌లో కేకేఆర్ తరఫున అతడు 52 సిక్సర్లు బాదాడు.



# వినేశ్ ఫొగాట్‌కు అనుమతి.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన రెజ్లింగ్ సమాఖ్య

స్పోర్ట్స్ డెస్క్: ఆసియా క్రీడలసెలక్షన్ ట్రయల్స్ 2026లో పాల్గొనేందుకు స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు ఇటీవల ఢిల్లీ హైకోర్టు అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ ఉత్తర్వును సవాల్ చేస్తూ భారత రెజ్లింగ్ సమాఖ్య సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ జస్టిస్‌లు పి.ఎస్.నరసింహా, అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు రాగా రేపు (శుక్రవారం) విచారణ జరగనుంది.

మే 22న ఢిల్లీ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వుల నుంచి ఈ న్యాయ వివాదం మొదలైంది. ఆ ఉత్తర్వులో రాబోయే సెలక్షన్ ట్రయల్స్‌లో పోటీ చేయడానికి ఫొగాట్‌కు అనుమతి లభించింది. మే 30, 31 తేదీల్లో ఆసియా క్రీడల సెలక్షన్ ట్రయల్స్ జరగనున్నాయి. ఆసియా క్రీడల కోసం భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) నిర్దేశించిన ఎంపిక ప్రమాణాలు వివక్షపూరితంగా ఉన్నాయని ఇటీవల ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. రెజ్లింగ్ సమాఖ్య నిర్ణయించిన ప్రమాణాలు గత ప్రదర్శనలను పరిగణనలోకి తీసుకునేలా లేవని వ్యాఖ్యానించింది.

ఎంపిక ట్రయల్స్ నుంచి వినేశ్ ను మినహాయించడం ఆమె తీసుకున్న ప్రసూతి విరామానికి నేరుగా ముడిపడి ఉందని వెల్లడించింది. మే 9న వినేశ్‌కు డబ్ల్యూఎఫ్ఐ జారీ చేసిన షోకాజ్ నోటీసులో.. అధిక బరువుతో పారిస్ ఒలింపిక్స్ ఫైనల్లో వినేశ్ అనర్హతకు గురికావడాన్ని దేశానికి అవమానం అని వ్యాఖ్యానించడంపై హైకోర్టు సీరియస్ అయింది. ట్రయల్స్‌లో వినేశ్ పాల్గొనేందుకు నిబంధనలు అంగీకరించవని డబ్ల్యూఎఫ్ఐ చేసిన వాదనను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. మే 30,31 తేదీలలో జరగనున్న ట్రయల్స్‌లో వినేశ్‌ను పాల్గొనేందుకు అనుమతించాలని ఆదేశించింది. ఎంపిక ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించడానికి, ట్రయల్స్‌ను ద్వారా వీడియో రికార్డ్ చేయాలని కూడా కోర్టు ఆదేశించింది.



# వైభవ్ టాలెంట్‌ను గుర్తించింది అతనే

స్పోర్ట్స్ డెస్క్: రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం, యూనివర్సల్ బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీ మరోసారి టాక్ ఆఫ్ ది క్రికెట్ వరల్డ్‌గా మారాడు. ఐపీఎల్ 2026లో భాగంగా బుధవారం సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ(29 బంతుల్లో 97 పరుగులు ) సునామీ బ్యాటింగ్‌తో చెలరేగాడు. దాంతో ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 47 పరుగులతో విజయాన్ని అందుకొని క్వాలిఫయర్-2కు అర్హత సాధించింది. ఈ నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీ గురించి సోషల్ మీడియాలో తెగ చర్చ జరుగుతోంది. ఈ సిక్సర్ల పిడుగు ప్రతిభను తొలిసారి గుర్తించింది ఎవరు? అని నెటిజన్లు తెగ సెర్చ్ చేస్తున్నారు. తొలిసారి వైభవ్ సూర్యవంశీ ప్రతిభను బిహార్ మాజీ స్పిన్నర్, రాజస్థాన్ రాయల్స్ నెట్ బౌలర్ సమర్ ఖాద్రి గుర్తించాడు. బిహార్‌లోని ఓ స్థానిక మ్యాచులో వైభవ్ సిక్సర్లకు ఆయన ఫిదా అయ్యాడు. ఓసారి రాజస్థాన్ రాయల్స్ మాస్టర్ మైండ్ జుబిన్ టాలెంటెడ్ ప్లేయర్లను గుర్తించాలని సమర్‌కు సూచించగా ఆయన వైభవ్ పేరును పరిచయం చేశాడు. చెన్నైలో స్కౌటింగ్ ట్రయల్‌లో ఆ చిచ్చరపిడుగు 60 బంతుల్లోనే 150 పైగా పరుగులు చేశాడు. గంటకు 150 కిలోమీటర్ల వేగంతో వచ్చిన బంతులను కూడా వైభవ్ ఈజీగా బాదడంతో రాజస్థాన్ స్కౌటింగ్ జట్టు ఆశ్చర్యపోయింది. వైభవ్ సూర్యవంశీ గురించి అప్పటి హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు సమర్ ఖాద్రి చెప్పాడు. ద్రావిడ్ పరీక్షించి మరీ ఐపీఎల్ 2025 మెగా వేలంలో రూ.1.10 కోట్లకు కొనుగోలు చేశాడు. గత సీజన్‌లోనే అవకాశం కల్పించగా.. ఫస్ట్ మ్యాచ్‌లోనే ఆకట్టుకున్నాడు. ఈ సీజన్‌లో కూడా అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా వైభవ్ కొనసాగుతున్నాడు.

# రైతులు ఆందోళన చెందొద్దు.. 15 రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి: కలెక్టర్ ఆదర్శ్ సురభి

**తడిసిన ధాన్యాన్నీ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.. అదనపు గోదాముల ఏర్పాటు**




**వనపర్తి, సమయం ప్రతినిధి:** వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేసి వచ్చే 15 రోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేస్తుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హామీ ఇచ్చారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. గురువారం వనపర్తి మండలం చిట్యాల శివారులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం నిల్వ కోసం అదనంగా ఏర్పాటు చేసిన గోదామును అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి కలెక్టర్ సందర్శించారు. అక్కడ జరుగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 600 మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని బాయిల్ మిల్లులకు తరలించినట్లు వెల్లడించారు. జిల్లాలో గత రెండేళ్లుగా రికార్డు స్థాయిలో వరి దిగుబడులు నమోదవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. గతంలో ఒక సీజన్‌కు సుమారు 1.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం అది 2.50 లక్షల మెట్రిక్ టన్నులకు చేరిందన్నారు. అధిక దిగుబడుల కారణంగా గోదాముల్లో స్థల కొరత ఏర్పడుతోందని వివరించారు. ఈసారి వరి కోతలు ఆలస్యంగా ప్రారంభం కావడం, బీహార్ నుంచి వచ్చే హమాలీల కొరత కారణంగా కొనుగోళ్ల ప్రక్రియ కొంత నెమ్మదించిందన్నారు. అయినప్పటికీ రబీ సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలించామని, మరో లక్ష మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. స్థల కొరత దృష్ట్యా చిట్యాల మార్కెట్ యార్డులోని షెడ్-1ను తాత్కాలిక గోదాముగా మార్చి ధాన్యాన్ని నిల్వ చేస్తున్నట్లు తెలిపారు. అదనంగా మరిన్ని స్థలాలను సిద్ధం చేసే చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. హమాలీల సంఖ్య పెంచేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అనంతరం చిమనగుంటపల్లి శివారులోని లక్ష్మీ వెంకటేశ్వర గోదామును సందర్శించిన కలెక్టర్ అక్కడ అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, డీసీఎస్‌వో కాశీ విశ్వనాథ్, డీఆర్‌డీవో ఉమాదేవి, కార్మిక శాఖ అధికారి రవి, మార్కెటింగ్ శాఖ అధికారి స్వరణ్ సింగ్, డీసీవో రాణి, జిల్లా మేనేజర్ సివిల్ సప్లై ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యానికీ మద్దతు ధర.. రైతుకు అండగా జిల్లా యంత్రాంగం



**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి :** అకాల వర్షాలకు తడిసిపోయిన వరి ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి రైతుకు ప్రభుత్వం అండగా నిలిచిన ఘటన భూత్పూర్ మండలంలో చోటుచేసుకుంది. జిల్లా యంత్రాంగం చొరవతో రైతు నష్టపోకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి పారా బాయిల్డ్ రైస్ మిల్లుకు తరలించడం రైతుల్లో విశ్వాసాన్ని పెంచింది. భూత్పూర్ మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన రైతు కె. శ్రీనివాసులు నిల్వ చేసిన వరి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా తడిసిపోయింది. దీంతో రైతు తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. ఈ విషయాన్ని గుర్తించిన జిల్లా యంత్రాంగం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వెంటనే స్పందించి ప్రత్యేక చర్యలు చేపట్టింది. హస్నాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రవి నాయక్, సంబంధిత అధికారులు రైతు ధాన్యం లోతట్టు ప్రాంతంలో నిల్వ ఉండటంతో వర్షపు నీటిలో తడిసిపోయినట్లు గుర్తించారు. సుమారు 150 నుంచి 200 వరి సంచులు తడిసిన నేపథ్యంలో రైతుకు నష్టం కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాటికొండలోని నరహరి పారా బాయిల్డ్ రైస్ మిల్ యాజమాన్యంతో అధికారులు చర్చించి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేలా సమన్వయం చేశారు. గురువారం జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రవి నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్ హస్నాపూర్ గ్రామాన్ని మరోసారి సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. తడిసిన ధాన్యాన్ని బస్తాల్లో నింపి తూకం నిర్వహించిన అనంతరం మొత్తం 156 బస్తాలను ట్రాక్టర్ల ద్వారా సమీపంలోని నరహరి పారా బాయిల్డ్ మిల్లుకు తరలించారు. మిల్లర్‌కు వెంటనే ధాన్యం దిగుమతి చేసుకోవాలని అధికారులు ఆదేశించారు. అలాగే మిల్లర్ అక్‌నాలెడ్జ్ చేసిన వెంటనే ట్రక్ షీట్ జనరేట్ చేసి రైతుకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్‌కు సూచించారు.

## బక్రీద్ మనుషుల మధ్య ప్రేమ, సహనం, సోదరభావాన్ని పెంపొందిస్తుంది



**ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నగరకుంట నవీన్ రెడ్డి**
**ఉమ్మడి పాలమూరు,షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**
**మామిడిపల్లిలో బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**

**సమయం ప్రతినిధి షాద్నగర్ :** బక్రీద్ మనుషుల మధ్య ప్రేమ, సహనం, సోదరభావాన్ని పెంపొందిస్తుందని ఉమ్మడి పాలమూరు మరియు షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి.బక్రీద్ పర్వదిన సందర్భంగా నందిగామ మండలం మామిడిపల్లి గ్రామంలో ఈద్గా వద్ద మైనార్టీ సోదరుతో కలిసి బక్రీద్ వేడుకలలో పాల్గొన్నారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ బక్రీద్ పండుగ ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన పండుగల లో ఒకటని,ఈ పండుగ త్యాగం,భక్తి,దానధర్మాల గొప్పతనాన్ని తెలియజేస్తుంది పేదలతో ఆనందాన్ని పంచుకోవాలని,అవసరమైన వారికి సహాయం చేయాలని ఈ పండుగ సందేశం ఇస్తుందని అన్నారు.ఈ వేడుకలలో మామిడిపల్లి సర్పంచ్ మోత్కూరి హనుమంత్ రెడ్డి,మొదల్లగూడ సర్పంచ్ పెండ్యాల అరుణరాజు, శ్రీనివాసులగూడ సర్పంచ్కుమ్మరి పద్మమ్మ క్రిష్ణయ్య,మామిడిపల్లి మాజీ ఎంపీటీసీ కాట్న రవీందర్,మామిడిపల్లి ఉపసర్పంచ్ మామిళ్ళపల్లి రాజు,మాజీ ఉపసర్పంచ్ సత్యనారాయణ,వార్డు మెంబర్లు,బీఆర్ఎస్ నాయకులు, మైనారిటీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ నీటి సరఫరాకు తాత్కాలిక అంతరాయం

**జడ్చర్ల నియోజకవర్గంలోని 191 ఆవాసాలకు ప్రభావం**

**జడ్చర్ల, సమయం ప్రతినిధి :** జడ్చర్ల NH-44 ఫ్లైఓవర్ సమీపంలోని జడ్చర్ల–కావేరమ్మపేట సర్వీస్ రోడ్డులో ఉన్న DI 600 పైపులైన్ ఫ్లడ్ డ్యామేజ్ కారణంగా దెబ్బతినడంతో భగీరథ నీటి సరఫరాకు తాత్కాలిక అంతరాయం ఏర్పడింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పైపులైన్ మరమ్మతు పనులు గురువారం చేపట్టగా, శుక్రవారం కాంక్రీట్ ఎన్‌కేస్‌మెంట్ పనులు నిర్వహించనున్నారు. దీని ప్రభావంతో మే 28 రాత్రి 8 గంటల నుంచి మే 29 మధ్యాహ్నం 2 గంటల వరకు సుమారు 18 గంటల పాటు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం నుంచి సరఫరా పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మరమ్మతు పనుల కారణంగా జడ్చర్ల నియోజకవర్గంలోని జడ్చర్ల, రాజాపూర్, బాలానగర్, నవాబుపేట్ మండలాల పరిధిలోని 191 ఆవాసాలకు భగీరథ తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు వెల్లడించారు. ఇక ఎల్లూరు (కొల్లాపూర్) పంప్ హౌస్‌లో గత వారం రోజులుగా పంపుల పార్ట్స్, ఇంపెల్లర్స్, షాఫ్ట్, స్లీవ్స్ మరమ్మతు పనుల కారణంగా నాగసాల, మల్లెబోయినపల్లి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు తెలిపారు. అయితే గురువారం ఉదయానికి మరమ్మతు పనులు పూర్తికాగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి నాగసాల 77 MLD, మల్లెబోయినపల్లి 10 MLD నీటి సరఫరా పునరుద్ధరించబడినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు ముందస్తుగా తాగునీటిని నిల్వ చేసుకుని అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## యావత్ తెలంగాణ ప్రజానీకానికి, బక్కని నర్సింలు క్షమాపణలు చెప్పాలి


**బిఆర్ఎస్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్ రెడ్డి**
**ఆత్మ బలిదానాలతో, పోరాటాలతో,తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది**
**ఆంధ్ర పాలకుల మెప్పు కోసం, పదవుల కోసం,తెలంగాణను అవమానించడం సరైనది కాదు**



**సమయం ప్రతినిధి షాద్నన గర్ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం యావత్ తెలంగాణ ప్రజానీకం పోరాటాలతో ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని తెలంగాణ ప్రజల గుండెల్లో చిర స్థాయిగా పేరు ప్రఖ్యాతాలను నిలిచి పోయాయని ఆంధ్ర పాలకుల మెప్పు కోసం పదవుల కోసం తెలంగాణ రాష్ట్రాన్ని అవమానించడం సరైనది కాదని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి, టిడిపి మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుపై మండిపడ్డారు వెంటనే యావత్ తెలంగాణ ప్రజానీకానికి ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు తెలంగాణ పదం డిక్షనరీలో లేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆయన మాట్లాడడం విడ్డూరమన్నారు బక్కని నర్సింలు మాటలపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు మంత్రులు స్పందించాలన్నారు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతోనే ఈ ప్రాంత ప్రజలు ముఖ్యమంత్రులు ఎమ్మెల్యేలు అయ్యారని అది గుర్తుపెట్టుకోవాలన్నారు తెలంగాణ రాష్ట్రంలో ఉంటు తెలంగాణ రాష్ట్రాన్ని అవమానించే విధంగా మాట్లాడడం హస్యాస్పదమన్నారు.

## తరుగు పేరుతో రైతుల దోపిడి..? భూత్పూర్‌లో రైస్ మిల్లుపై ఆరోపణలు

**క్వింటాల్‌కు 19 కిలోల తరుగు చేశారంటూ రైతు ఆవేదన**




**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి:** జిల్లాలో కొందరు రైస్ మిల్లర్లు తరుగు పేరుతో రైతులను దోపిడి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూత్పూర్ మండలం పోతులమడుగు గ్రామంలోని భాను రైస్ మిల్లులో రైతుల నుంచి అధిక మొత్తంలో తరుగు వసూలు చేస్తున్నారంటూ బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల వాదన ప్రకారం, మిల్లు నిర్వాహకులు ఏకంగా క్వింటాల్‌కు 19 కిలోల వరకు తరుగు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు. ఈ వ్యవహారాన్ని రైతు తిరుపతయ్య రికార్డ్ చేసినట్లు సమాచారం. “జీవితంలో ఎన్నడూ ఇంత దోపిడి చూడలేదు. క్వింటాల్‌కు 19 కిలోల తరుగు అంటే రైతు ఎలా బతుకుతాడు” అంటూ రైతు తిరుపతయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తాము అభ్యంతరం వ్యక్తం చేయగా, బ్రతిమిలాడితే ఒక కిలో తగ్గిస్తామని మిల్లు నిర్వాహకులు చెప్పారని ఆరోపించారు. అంతేకాకుండా, మిల్లు యాజమాన్యం నిర్ణయించిన తరుగు శాతానికి ఒప్పుకుంటేనే ధాన్యం అన్‌లోడ్ చేస్తామని షరతులు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

## తెలంగాణలో భారీగా తగ్గనున్న టెక్ట్స్ బుక్స్

హైదరాబాద్ : 2026–27 విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో తల్లిదండ్రులు, విద్యార్థులకు భారీ ఊరటను ఇచ్చే వార్త వచ్చింది. విద్యార్థుల పుస్తకాల ధరలు భారీగా తగ్గడం విశేషం. ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి పాఠ్య పుస్తకాల ధరలు తగ్గడంతో.. ఆర్థికంగా కాస్త రిలీఫ్ లభించింది. గరిష్ఠంగా 20 శాతం వరకు ధరలు తగ్గడంతో విద్యార్థులు ఆనందంగా ఫీల్ అవుతున్నారు. ఒకవైపు యుద్ధం కారణంగా అన్ని రకాల వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న వేళ.. పుస్తకాల ధరలు తగ్గడం గమనార్హం. అయితే ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం పుస్తకాల ప్రింటింగ్ కోసం.. టెండర్లను పిలిచింది.




గతంలో డివోషనల్ మూవీస్‌లోనే దైవలీలలు కనిపించేవి. అడపా దడపా సోషల్ మూవీస్‌లోనూ ఫాంటసీ పేరుతో దేవుళ్ళను చూపించే వారు. అయితే ఈ మధ్య కాలంలో ఆ తరహా క్రియేటివ్ ఫ్రీడమ్‌ను మేకర్స్ ఎక్కువగా తీసుకుంటున్నారు. స్టార్ హీరోలైనా దైవిక బలంతోనే వారు విజయం సాధించినట్టుగా చూపించడం ఈ మధ్య చాలా కామన్ అయిపోయింది. మెగాస్టార్ చిరంజీవి సినిమాలలో ఆంజనేయ స్వామి అండ ఆయనకు లభించినట్టుగా చాలా వాటిల్లో చూపించారు. కొన్ని సినిమాలలో చిరంజీవి సరదాగా 'హనుమంతుడి' గెటప్‌లోనూ కనిపించారు. అలానే ఆంజనేయ స్వామి గొప్పతనాన్ని తెలిపే పాటలు, సన్నివేశాలు ఆయన సినిమాల్లో అనేకం ఉన్నాయి. త్వరలో రాబోతున్న విశ్వంభర లోనూ హనుమంతుడికి సంబంధించిన కొన్ని సన్నివేశాలు ఉంటాయని టీజర్ చూస్తే అర్థమౌతోంది. పైగా గతంలో వచ్చిన 'హనుమాన్' యానిమేటెడ్ మూవీకి చిరంజీవి డబ్బింగ్ చెప్పడం, తన బ్యానర్ కొణిదెల ప్రొడక్షన్స్ కు హనుమంతుడి లోగోనే పెట్టడం ఇవన్నీ మెగా కుటుంబానికి హనుమంతుడితో ఉన్న అనుబంధాన్ని చెప్పకనే చెబుతున్నాయి.

**పెద్ది'లో హనుమంతుడి ఎపిసోడ్!**

రామ్ చరణ్ 'పెద్ది' సినిమాలోనూ హనుమంతుడికి సంబంధించిన ఓ ఎపిసోడ్ ఉందని చెబుతున్నారు. డైరెక్ట్‌గా హనుమంతుడు సినిమాలో కనిపించకపోయినా.. ఆయాన ప్రభావాన్ని ఇందులో చూపించారని తెలుస్తోంది. రామ్ చరణ్ గదను భుజాన పెట్టుకుని ఉన్న సన్నివేశం, ఆ తర్వాత దానితో చేసే పోరాటం చూస్తే.. రామ్ చరణ్‌లో హనుమంతుడి అంశ కనిపిస్తుందని అంటున్నారు.

గతంలో 'ట్రిపుల్ ఆర్' క్లయిమాక్స్‌లో రామ్ చరణ్‌ను శ్రీరాముడి తరహాలో రాజమౌళి చూపించిన సంగతి తెలిసింది. ఆ సన్నివేశాలకు వచ్చిన అప్లాజ్‌ను దృష్టిలో పెట్టుకునే పెద్ది దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ హనుమంతుడి ఎపిసోడ్ రాశాడని అంటున్నారు. ఇక ఇదే సమయంలో రామ్ చరణ్, జాన్వీ కపూర్, శ్రుతీ హాసన్ పై పిక్చరైజ్ చేసిన స్పెషల్ సాంగ్ థియేటర్ లో మాస్ ఆడియెన్స్ తో విజిల్స్ వేయించడం ఖాయంగా కనిపిస్తోంది.

**ట్రయాంగిల్ లవ్ స్టోరీ 'పెద్ది'!**

ఇంతవరకూ 'పెద్ది' ఓ వ్యక్తి ఐడెంటిటీకి సంబంధించిన సినిమా అని, ఇది క్రాస్ ఓవర్ అథ్లెట్ కథ అని మాత్రమే మేకర్స్ చెబుతూ వచ్చారు. అయితే ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఈ చిత్రంలో నటించిన కీలక పాత్రధారి దివ్యేందు శర్మ 'పెద్ది' ట్రయాంగిల్ లవ్ స్టోరీ అనే విషయాన్ని రివీల్ చేశాడు. దాంతో ఈ సినిమాలోని కొత్త కోణం బయటపడింది. ఫ్యాన్స్ కోసం రామ్ చరణ్ ఎంత కష్టమైన పడతాడని బొమన్ ఇరానీ కితాబిచ్చారు. ఈ సినిమాలో దర్శకుడు బుచ్చిబాబు సానా చెప్పినట్టే తాను చేశానని, అతనికి తామంత పెద్ద ఫ్యాన్స్ అని జాన్వీ తెలిపింది. ఈ సినిమా కథ గురించి గతంలో ప్రధాని నరేంద్ర మోదీని కలిసినప్పుడు చెప్పానని రామ్ చరణ్ అన్నారు. జూన్ 4న పిల్లలతో కలిసి 'పెద్ది' చూడాల్సిందిగా ఆయన కోరారు. సో.. భారీ అంచనాల నడుమ పాన్ ఇండియా మూవీగా విడుదల కానున్న 'పెద్ది' ఎలాంటి రికార్డ్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి.




తెలుగు నేలపై ఎందరో మహానుభావులు జన్మించారు. కానీ కొంత మంది మాత్రమే ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారు. రాముడిగా, కృష్ణుడిగా కనిపించిన ఆయన రాజకీయాల్లోనూ తనదైన మార్క్ వేశారు. ఆ మహానీయుడు జయంతి సందర్భంగా తెలుగు రాష్ట్రాలలో ఘన నివాళు లర్పించారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలు ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ భరత్ భూషణ్ నేతృత్వంలో ఫిలింనగర్‌లో ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులు హాజరై ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ పేరిట 1000 మందికి పైగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు సినీ ప్రముఖులు ఎన్టీఆర్ తో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకొని, ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎన్టీఆర్ జన్మదినం తెలుగు జాతి మరువలేని రోజు అని, ఆయన తెలుగు జాతికి ఒక వరమంటూ ఆయన ఆశీస్సులు తెలుగువారందరికీ ఎప్పుడూ ఉండాలని ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ ఆకాంక్షించారు. తెలుగు జాతి ఆరాధ్య దైవం ఎన్టీఆర్ అంటూ సినీ, రాజకీయ రంగాల్లో ప్రజలను మెప్పించిన వ్యక్తి అని కొనియాడారు ఆయన కుమారుడు నందమూరి మోహనకృష్ణ. ఆడవారికి ఆస్తి వాటా ఇవ్వాలని చెప్పిన మహానుభావుడు అని గుర్తు చేశారాయన. ఇక అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేసిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు మోహనకృష్ణ. తన తాతగారు తెలుగు జాతిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని, విపత్తు సమయాల్లో రాష్ట్రం కోసం ముందుండేవారని మనవరాలు నందమూరి మోహన రూప చెప్పారు. చిన్నప్పటి నుంచి ఎన్టీఆర్ అభిమానినని, రాజకీయాలు తెలియని తనను ఆయనే రాజకీయాల్లోకి తీసుకొచ్చి ముందుకు నడిపించారని మాజీ మంత్రి నటుడు బాబుమోహన్ గుర్తు చేసుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాత నటుడు ఎన్టీఆర్ అని, బాలీవుడ్ నుంచి ఎన్నో ఆఫర్లు వచ్చినా తెలుగు వారి కోసమే తన జీవితాన్ని అంకితం చేశారని నిర్మాతల మండలి కార్యదర్శి తుమ్మల ప్రసన్నకుమార్ అన్నారు. ప్రజలే తన కుటుంబమని రాజకీయాల్లోకి వచ్చి అందరినీ సమానంగా చూశారన్నారాయన. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ జయంతి కార్యక్రమం ఎన్టీఆర్ అభిమానులకు మరపురాని అనుభూతిని పంచింది. ఆద్యంతం ఎన్టీఆర్ తో ఉన్న జ్ఞాపకాలను అనుభవాలను గుర్తు చేసుకొని సభికులు, ఎన్టీఆర్ అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు.




శ్రీకాంత్, లయ హీరో హీరోయిన్లుగా.. నటకిరీటి రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో, దర్శకుడు జి. నాగేశ్వర్ రెడ్డి రూపొందిస్తోన్న అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ మిడిల్ క్లాస్' జీకే అండ్ సిఎన్ నిర్మిస్తున్న ఈ చిత్ర టీజర్‌ని తాజాగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి గెస్టులుగా వచ్చిన డైరెక్టర్ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డిలకు ధన్యవాదాలు. ఈ మధ్య చాలా సినిమాల వేడుకలకు గెస్ట్‌గా వచ్చాను. ఇప్పుడీ వేడుకలో మాట్లాడుతుంటే.. గెస్టునా, హీరోనా అని నాకే డౌట్ వస్తోంది. చాలా రోజుల తర్వాత నేను హీరోగా నటించిన నా సినిమా టీజర్ లాంచ్‌కు రావడం ఆనందంగా వుంది. గంగుల కమలాకర్ ఫోన్ చేసి ఒక మంచి ఎంటర్‌టైనర్ చేద్దామని చెప్పారు. నేను వెంటనే ఖచ్చితంగా చేద్దామని చెప్పాను. నాగేశ్వర్ రెడ్డి దర్శకుడు అని తెలిసిన తర్వాత నా కాన్ఫిడెన్స్ మరింత పెరిగింది. మిడిల్ క్లాస్ కుటుంబాలందరికీ కనెక్ట్ అయ్యే సినిమా చేసి చాలా రోజులైంది.







OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085